www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 15 డిసెంబరు 2022
5
పశ్చిమ గోదావరి

నేడు 'ఉద్యోగ, కార్మికుల పట్ల ప్రభుత్వాల వైఖరి'పై సదస్సు

తణుకు రూరల్:వచ్చే జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరగనున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ సందర్భంగా 'ఉద్యోగ, కార్మికుల పట్ల ప్రభుత్వాల వైఖరి' అనే అంశంపై ఈ నెల 15న తణుకు ఎన్‌జిఒ హోమ్‌లో సదస్సు నిర్వహిస్తున్నామని, సదస్సుకు ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్ హాజరౌతున్నారని జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పరిశ్రమల స్థాపనతోనే అభివృద్ధి సాధ్యం

తీరంలో ఓడరేవులు ఏర్పాటు చేయాలి - సిఐటియు జిల్లా సదస్సులో పిడిఎఫ్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు - హాజరైన పలువురు ప్రముఖులు



మాట్లాడుతున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు

ప్రజాశక్తి - భీమవరం

పరిశ్రమల స్థాపనతోనే నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమని, దీనికి విభజన హామీల అమలే కీలకమని పిడిఎఫ్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన తీరు సరిగ్గా లేకపోగా, ఆ సందర్భంగా పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను సైతం కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తుంగలోకి తొక్కి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన హామీల అమలుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. జనవరి 2, 3, 4 తేదీల్లో స్థానికంగా జరగనున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ సందర్భంగా బుధవారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో 'పారిశ్రామికాభివృద్ధి అవకాశాలు-అవరోధాలు' అంశంపై జిల్లాస్థాయి సదస్సు సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ తొలిసారి అత్యంత ప్రతిష్టాత్మకంగా సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ జనవరి 2,3, 4వ తేదీల్లో భీమవరం పట్టణంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభకు అంతా సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యవక్త, ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. విశాఖపట్నం, హైదరాబాద్ అభివృద్ధికి ఆయా ప్రాంతాల్లో నెలకొల్పిన పరిశ్రమలు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలే కారణమని అన్నారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు ఉద్యమంలో 32 మంది తమ ప్రాణాలు బలిదానం చేశారని, అటువంటి ప్రతిష్టాత్మక విశాఖ ఉక్కును కేంద్రం ప్రయివేటీకరిస్తామనడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్ విలువ రూ.మూడు లక్షల కోట్లని, రూ.15 వేల కోట్లు నష్టం వచ్చిందని కారుచౌకగా అమ్మేస్తామనడం కేంద్ర ప్రభుత్వ కుటిల నీతికి నిదర్శనమన్నారు. ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, పైగా ఉన్న ఉపాధిని హరించే విధానాలు అమలు చేస్తూ నిరుద్యోగాన్ని పెంచుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటి కేంద్ర ప్రభుత్వం కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖ, తిరుపతిలో విమానాశ్రయాలు, నెల్లూరులో భారీ ఓడరేవు, విశాఖలో రైల్వే జోన్, విశాఖ, విజయవాడలో మెట్రో రైలు నిర్మాణం, చెన్నయ్ నుంచి విశాఖ వరకు ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం వంటి హామీలను ఇచ్చిందని, తర్వాత అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం వాటన్నింటినీ అటకెక్కించిందని విమర్శించారు. రాజధాని నిర్మాణానికి రూ.45 వేల కోట్లు ఇవ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.15 వందల కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని మండిపడ్డారు. రాష్ట్రం అభివృద్ధి కావాలంటే ఫార్మాస్యూటికల్, ఐటి కంపెనీలు రాయలసీమ, కోస్తాంధ్రా ప్రాంతాల్లో పెడితే అభివృద్ధికి దోహదపడతాయన్నారు. అభివృద్ధి చెందుతున్న పశ్చిమగోదావరి జిల్లాలోని నర్సాపురంలో ఓడరేవు పెడితే మరిన్ని పరిశ్రమలు వస్తాయని సూచించారు. రాష్ట్రంలో మేధావులు, విద్యావేత్తలు రాష్ట్ర అభివృద్ధిపై చర్చించాలన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సదస్సులో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, జిల్లా కార్యదర్శులు డి.కళ్యాణి, అల్లూరి అరుణ్, మల్లిపూడి ఆంజనేయులు, పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పట్టాభి సీతారామయ్య, నాయకులు పి.సీతారామరాజు, సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం రావాలి

కనుమూరి సత్యనారాయణరాజు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షులు, భీమవరం

పరిశ్రమలు రావాలంటే భూమి ఉండాలి. భీమవరం వంటి పట్టణంలో భూమి దొరకడం అనేది భారీ ఖర్చుతో కూడుకున్న పని. ప్రభుత్వ భూములు ఉన్నచోట పరిశ్రమలు స్థాపిస్తే ఉపయోగకరం. ఇక్కడ వాళ్లంతా హైదరాబాద్ వంటి నగరాల్లో పెట్టుబడులు పెడుతున్నారంటే ఇక్కడ అవకాశాలు లేనట్లే. పరిశ్రమలు రావాలంటే ప్రజల్లో కూడా చైతన్యం రావాలి.

రైస్‌మిల్లులు మూతపడుతున్నాయి

చవ్వాకుల నరసింహారావు, ప్యాడీ అండ్ రైస్‌మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, భీమవరం

1962లో భీమవరం పరిసర ప్రాంతాల్లో సుమారు వంద రైస్‌మిల్లులు ఉండేవి. కాలక్రమేణా పలు మార్పులు రావడం, వ్యవసాయ సాగు తగ్గి ఆక్వా సాగు పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం 20 రైస్‌మిల్లులు కూడా తిరిగే పరిస్థితి లేదు. నూతనంగా ఏర్పడిన జిల్లా కేంద్రమైన భీమవరంలో భూమి దొరకడం అనేది మాములు విషయం కాదు. అయినా పరిశ్రమలు వస్తేనే అభివృద్ధి అనేది సాధ్యం.

సమస్యల పరిష్కారానికి సదస్సులు దోహదం

గన్నాబత్తుల శ్రీనివాస్, బిల్డర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, భీమవరం

విభజన హామీల అమలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు వంటి ప్రధాన సమస్యల పరిష్కారానికి ఇటువంటి సదస్సులు దోహదపడతాయి. సిఐటియు తరపున ఏర్పాటు చేసే ఏ కార్యక్రమానికైనా మా సహకారం ఉంటుంది. 175 మంది ఎంఎల్‌ఎలు, 150 మంది ఎంఎల్‌సిలు ఉన్నప్పటికీ ఎవరూ విశ్లేషించని అంశాలు లక్ష్మణరావు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ఇటువంటి అంశాలు ఆచరణలోకి తీసుకొస్తే ఎంతో దోహదపడతాయి.

అవినావభావ సంబంధం కొనసాగుతుంది

కురిసేటి రాజా, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, భీమవరం

సిఐటియు, రైస్‌మిల్లుల యాజమాన్యాలకు పూర్వం నుంచి అవినాభావ సంబంధం ఉంది. సిఐటియు అనుబంధ యూనియన్ ఉన్నచోట రైస్‌మిల్లులు బాగా తిరుగుతున్నాయి. లేనిచోట కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పరిశ్రమల స్థాపన ఎంత అవసరమో ఉన్న పరిశ్రమలను రక్షించుకోవడం కూడా అంతే అవసరం.

ప్రభుత్వరంగ సంస్థలు ఉంటేనే అభివృద్ధి

జి.జేమ్స్, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు, భీమవరం

విభజన హామీల అమలు జరగకపోవడం వల్ల అభివృద్ధిలో వెనుకపడ్డాం. ప్రభుత్వ రంగ సంస్థలు ఉంటేనే అభివృద్ధి సాధ్యం. పరిశ్రమలు నెలకొల్పకపోతే పరిస్థితి దారుణంగా తయారవుతుంది. సమస్యలపై సిఐటియు అలుపెరగని పోరాటం చేస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో కమ్యూనిస్టులు సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తూ ఉంటారు. రాబోయే రోజుల్లో వారికి అన్ని రకాలుగా సంఘం తరపున పూర్తి సహకారం ఉంటుంది.

బిల్లులు చెల్లించరూ..

ఎంపిడిఒ కార్యాలయం వద్ద కాంట్రాక్టర్ నిరసన

నిరసన తెలుపుతున్న పద్మరాజు

ప్రజాశక్తి - వీరవాసరం

తాను పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్ కడలి పద్మరాజు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యలయం వద్ద నిరసన చేపట్టారు. వెంటనే ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు, తహాశీల్దార్ సుందరరాజు ఆయనతో చర్చించి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. 2020లో జగనన్న లేఅవుట్‌లకు సంబంధించి పల్లపు భూములను పద్మరాజు పూడిక చేశారు. ఆ పనులు పూర్తి చేసి రెండు సంవత్సరాలు పూర్తవుతున్నా ఇప్పటి వరకు తనకు దానికి సంబంధించిన బిల్లులను చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అతిపల్లంగా ఉన్న రెండు లేఅవుట్‌ల్లో ఆరడుగుల మేర పూడ్చి కంకర రోడ్లు వేశానని తెలిపారు. రూ.35 లక్షలు పెట్టుబడి పెట్టానని, అదంతా అప్పు తీసుకొచ్చానని వివరించారు. అయితే అధికారులు రూ.14 లక్షలు వరకు మాత్రమే ఎం.బుక్ నమోదు చేశారని తెలిపారు. అలాగే పంచాయతీ నుండి రూ.నాలుగు లక్షలు వరకు బిల్లులు చెల్లించారన్నారు. అధికారుల విజ్ఞప్తి మేరకు ఆ సమయంలో పనులు చేశానని, బిల్లులు మాత్రం చెల్లించడం లేదని, దీంతో వడ్డీలు పెరిగి తన కుటుంబం రోడ్డున పడే ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. ఈ సమస్యను ఎంపిడిఒ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సిఎఫ్ఎంఎస్ పరిధిలో కాంట్రాక్టర్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అయినప్పటికీ ఈ కాంట్రాక్టర్ సమస్యను ప్రత్యేక దృష్టితో పరిశీలిస్తామని హామీ ఇవ్వడంతో ఆయన ఆందోళన విరమించారు.



వినతి అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

పని సర్దుబాటులో లోపాలను సరిచేయాలి

లేనిపక్షంలో 16న ఆందోళన : యుటిఎఫ్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు అసంబద్ధంగా ఉందని, దీన్ని వెంటనే సరి చేయాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ నెల 15వ తేదీ సాయంత్రంలోపు దీన్ని సరిచేయని పక్షంలో ఈ నెల 16వ తేదీ సాయంత్రం డిఇఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించింది. ఈ మేరకు డిఇఒ కార్యాలయంలో యుటిఎఫ్ నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడుతూ ఒకవైపు బదిలీలు జరుగుతుండగా రెండోవైపు పని సర్దుబాటు ఎందుకని ప్రశ్నించారు. చేసిన పని సర్దుబాటు కూడా అసంబద్ధంగా ఉందని, బధిర, అంగవైకల్యం కలిగిన ఉపాధ్యాయులకు కూడా పని సర్దుబాటు చేయడం దారుణమని అన్నారు. పని సర్దుబాటు 30 నుంచి 40 కిలోమీటర్లు దాటి చేశారని తెలిపారు. వెంటనే దీన్ని నిలిపివేసి లోపాలను సరి చేయాలన్నారు. లేనిపక్షంలో ఈ నెల 16న డిఇఒ కార్యాలయం ముందు ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, జిల్లా సహాధ్యక్షులు కె.రాజశేఖర్, జిల్లా కార్యదర్శులు కెఎస్.సాయిరాం, డి.ఏసుబాబు, జి.రామకృష్ణంరాజు, రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్.కుమార్‌బాబ్జీ, ఐవి.నరసింహరాజు, బి.శ్రీనివాసరావు, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

సజావుగా ధాన్యం కొనుగోలు: కలెక్టర్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

జిల్లాలో ధాన్యం కొనుగోలు సజావుగా సాగుతోందని, కొనుగోలు విధానంపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి అధికారులకు, సిబ్బందికి సూచించారు. లంకలకోడేరులోని రైతుభరోసా కేంద్రాన్ని ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోనె సంచులకు ఇబ్బంది లేదని, అన్ని ఆర్‌బికెల్లో గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఎక్కడైనా ఏదైనా సమస్య తలెత్తితే ఉన్నతాధికారులకు తెలపాలని, అలసత్వం వహించినా, ఫిర్యాదులు వచ్చినా సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌బికెలో వివరాలను ఆమె పరిశీలించారు. అనంతరం లంకలకోడేరులోని వెంకటసాయి ట్రేడర్స్ రైస్‌మిల్లును కలెక్టర్ తనిఖీ చేశారు. ధాన్యం నిల్వల రికార్డులను పరిశీలించారు. రికార్డుల్లో వ్యత్యాసాలు ఉంటే సంబంధిత యాజమాన్యంపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట సివిల్ సప్లయీస్ జిల్లా అధికారి ఎన్.సరోజ, ఎఎస్ఒ ఎం.రవిశంకర్, వ్యవసాయ శాఖాధికారి అబ్దుల్ రహీమ్ పాల్గొన్నారు.

పెనుమంట్ర: తుపాను, భారీ వర్షాల వల్ల తడిచిన ధాన్యాన్ని రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ జె.మురళీ అన్నారు. బుధవారం మార్టేరులోని రైతుభరోసా కేంద్రం, కోడేరు రోడ్డులోని లక్ష్మీగణపతి ట్రేడర్స్ రైస్‌మిల్లును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మురళీ ఆర్‌బికెలో తేమ శాతం నిర్ధారణపై ఎఒ మద్దాల జయదుర్గమాధురి, విఎఎ కృష్ణగంగను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ 54 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి చేసినట్లు తెలిపారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామన్నారు. అధికారులకు ఎవరికీ టార్గెట్లు ఇవ్వలేదని చెప్పారు. ప్రతి రైతూ నుండి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ దండు అశోక్‌వర్మ, ఎంపిడిఒ బి.పూర్ణబాబ్జి, సిఎస్ ఆర్ఐ పోతురాజు, మార్టేరు ఉప సర్పంచి కర్రి వేణుబాబు, ఎఇఒ సత్యనారాయణ, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పోడూరు: జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగంగా సాగుతోందని జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని జిన్నూరు-1, 2 రైతుభరోసా కేంద్రాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోనే నగదు జమ చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. మిల్లులకు ధాన్యం తరలించడానికి వాహనాలను సిద్ధంగా ఉంచినట్లు వివరించారు. గోనె సంచులకు ఇబ్బంది లేదని తెలిపారు. అనంతరం లక్ష్మి, శ్రీనివాస్ రైస్‌మిల్లులను ఆయన తనిఖీ చేశారు. ధాన్యం సేకరణకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని రైస్‌మిల్లర్లను ఆదేశించారు. ధాన్యం నిల్వలు, ట్రక్ షీట్లు, రికార్డులను పరిశీలించారు. అవకతవకలకు పాల్పడినట్లు రుజువైతే సంబంధిత రైస్‌మిల్లులపై చర్యలు తప్పవని జెసి హెచ్చరించారు. ఆయన వెంట తహశీల్దారు ఆర్‌వి.కృష్ణారావు, వ్యవసాయ శాఖ, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్రలో జెసి మురళీ

ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్

ఇంధన వనరులను బాధ్యతాయుతంగా వినియోగించాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

పర్యావరణ పరిరక్షణకు ఇంధన వనరులను బాధ్యతాయుతంగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రకాశం చౌక్ నుంచి రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్, విద్యుత్ పంపిణీ సంస్థల ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. తొలుత ఇంధన పొదుపునకు సంబంధించిన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించి, ఇంధనాన్ని పొదుపుగా వినియోగిస్తామని అక్కడకు హాజరైన ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ విద్యుత్ వృధాను అరికట్టి సరైన రీతిలో వినియోగించడం వల్ల ఎన్నో లాభాలు ఉంటాయన్నారు. ఇతర ఇంధన వనరుల వినియోగంలోనూ జాగ్రత్తలు పాటించాలన్నారు. పెట్రోల్ వాహనానికి బదులు సైకిల్‌నూ వినియోగిస్తే పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. ఎల్ఇడి, సోలార్ దీపాలు వంటి వాటిని వినియోగించుకోవాలన్నారు. ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తామని, ప్రతి సచివాలయ పరిధిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ దాసిరాజు, జిల్లా పరిశ్రమల శాఖాధికారి వి.ఆదిశేషు, విద్యుత్ శాఖ ఇఇ పీర్ అహ్మద్‌ఖాన్, డిఇలు ఎం.రాజగోపాల్, పి.రాంబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న సుబ్బరాజు

ఆర్‌బికెల్లో గోనె సంచుల్లేక ఆందోళన

ఎపి కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు

ప్రజాశక్తి - పెనుమంట్ర

రైతు భరోసా కేంద్రాల్లో గోనె సంచులు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మల్లిపూడి, సోమరాజు ఇల్లింద్రపర్రు గ్రామాల్లో ధాన్యం కల్లాల వద్ద రైతుల ఇబ్బందులను సంఘం నేతలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో ఆర్భాటం చేస్తుందన్నారు. గోనె సంచుల కోసం సంబంధిత అధికారులకు ఫోన్ చేయగా వాహనాలు సీరియల్‌లో ఉండటం వల్ల ఆలస్యమవుతుందని తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ తరహా నిర్లక్ష్యం తగదని సుబ్బరాజు హెచ్చరించారు. కార్యక్రమంలో గుడిమెట్ల సత్తిరెడ్డి, కవురు రామారావు, పుచ్చకాయల కుటుంబరావు, కుమారి, కంతేటి సాయిగంగ, భవాని, రామలక్ష్మి, వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

సమన్వయంతో పార్టీ గెలుపునకు కృషి చేయాలి

వైసిపి ఉండి నియోజకవర్గ పరిశీలకులు సూర్యప్రకాశరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

వైసిపి శ్రేణులంతా సమన్వయంతో పని చేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకులు రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. భీమవరం యూత్ క్లబ్‌లో వైసిపి ఉండి నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు నియోజకవర్గంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్థాయిలో కార్యకర్తలకు విలువ లేదని, కనీసం ఎవరూ పట్టించుకోవట్లేదని అన్నారు. అనంతరం సూర్యప్రకాశరావు మాట్లాడుతూ డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహారాజు, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజు, నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి గోకరాజు రామరాజు (రామం) కలిసికట్టుగా నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ముందుకు సాగాలన్నారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగురవేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహారాజు, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజు, కాళ్ల జెడ్‌పిటిసి సోమేశ్వరరావు, ఆకివీడు మున్సిపల్ ఛైర్‌పర్సన్ హైమావతి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రౌతు సూర్యప్రకాశరావు

అమూల్ ఔట్‌లెట్ల ఏర్పాటుకు చర్యలు

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అమూల్ ఔట్‌లెట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసి సమావేశంలో అమూల్ ప్రాజెక్టుపై కలెక్టర్ సమీక్షించారు. ప్రధాన కూడళ్లు, కళాశాలల్లో అమూల్ ఉత్పత్తుల ఔట్‌లెట్లను ఎస్‌హెచ్‌సి గ్రూపుల ద్వారా నిర్వహించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. తాడేపల్లిగూడెం పరిధిలో 10 బిఎంసియులు ఏర్పాటు చేసి అమూల్ పాల సేకరణ జరుగుతుందన్నారు. నరసాపురం పరిధిలో మరో 21 బిఎంసియులను ఈ నెల 21న ప్రారంభించనున్నట్లు తెలిపారు. అమూల్‌కి పాలు ఇవ్వడం ద్వారా చేకూరే ప్రయోజనాలను రైతులకు సవివరంగా తెలియజేయాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి కె.మురళీకృష్ణ, జిల్లా కోఆపరేటివ్ అధికారి రవికుమార్, అమూల్ ప్రతినిధులు కేవల్ పటేల్, నవాజ్ పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి తోడ్పడాలి

ఒఎన్‌జిసి, సిఎస్ఆర్ నిధులు అందజేయడం ద్వారా జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఒఎన్‌జిసి అధికారులను కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో ఒఎన్‌జిసి అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యం, విద్య, జిల్లా అవసరాల ప్రతిపాదనల మేరకు సిఎస్ఆర్ నిధులను సమకూర్చాలన్నారు. నరసాపురం, పాలకొల్లు ప్రాంతాల్లో ఒఎన్‌జిసి పైపులైన్లు వెళ్లే మార్గంలో ఎక్కువ పేదలు నివశిస్తున్నారని, వారి అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలతో ముందుకొస్తామని, సిఎస్ఆర్ నిధులను కేటాయించాలని కోరారు. ఒఎన్‌జిసి డిఎం (హెచ్ఆర్) ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్య, వైద్యం, పారిశుధ్యం, మౌలిక వసతుల ఏర్పాటు అంశాలపై సాధారణంగా సిఎస్ఆర్ నిధులు ఖర్చు చేస్తారన్నారు. సమావేశంలో నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, జిల్లా పరిశ్రమల శాఖాధికారి వి.ఆదిశేషు, సిపిఒ కె.శ్రీనివాసరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇఇ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు అండగా జనసేన

పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్



చెక్కు అందిస్తున్న నాదెండ్ల మనోహర్

ఉంగుటూరు:ఆక్వా రైతులకు జనసేన అండగా ఉంటుందని పార్టీ పొలిటికల్ అఫైర్ కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని నారాయణపురంలో బుధవారం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మనోహర్ పాల్గొన్నారు. ఉండి మండలం కుప్పనపూడికి చెందిన జనసేన క్రియాశీలక కార్యకర్త శ్రీమన్నారాయణ విద్యుదాఘాతంతో ఇటీవల మృతిచెందారు. ఈ క్రమంలో పార్టీ తరపున సభ్యత్వ బీమాగా రూ.ఐదు లక్షల విలువైన చెక్కును భార్య, కుమారులకు అందించారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి మనోహర్ మాట్లాడుతూ ఆక్వారైతుల కష్టాలు, సమస్యలపై పార్టీ అధ్యయనం చేస్తోందని పూర్తి సమాచారం రాగానే విధివిధానాలను వెల్లడించి లాజిస్టిక్ హబ్ ఏర్పాటు చేసి ఆక్వారంగానికి అండగా ఉంటామని పవన్‌కల్యాణ్ కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. సంఖ్య ప్రధానం కాదని పరిపాలనలో నిజాయితీ ఉండాలని వైసిపిని విమర్శించారు. రాజోలులో రైతు భరోసా కేంద్రాల్లో బస్తాకు రూ.50 నుంచి రూ.వద వరకూ పన్ను కట్టాలంటూ రైతులను దోచుకోవడం దారుణమని విమర్శించారు. రైతులకు క్రాప్ హాలీడే కాదని, వైసిపికి హాలీడే ఇచ్చే రోజులు ముందున్నాయని విమర్శించారు. గోదావరి జిల్లాల్లో ఈ ఏడాది 46 మంది రైతులు అప్పులతో ఆత్మహత్యలు చేసుకున్నారని, ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో మూడు వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వం తప్పుడు లెక్కలతో 1100 మంది మాత్రమేనంటూ తప్పుడులెక్కలు చెబుతోందన్నారు.

జనసేన నాయకులను పోలీసులు వేధించి, అక్రమ కేసులు పెడితే అండగా ఉంటామని, ప్రతీ పోలీస్ స్టేషన్‌కు ఒక లాయర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉంగుటూరు నియోజకవర్గంలో జనసేనకు మంచి ఆదరణ ఉందన్నారు. ఇదే ఉత్సాహంతో రానున్న ఎన్నికల్లో జనసేనను గెలిపించాలని మనోహర్ పిలుపునిచ్చారు. పలువురు నాయకులను పార్టీలోకి ఆహ్వానించి జెండా కప్పారు. ఆక్వా రైతులతో ముచ్చటించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, మహిళలు, కార్యకర్తలతో మాట్లాడారు. తొలుత ఉంగుటూరు టోల్‌గేటు వద్ద మనోహర్‌కు ఘనస్వాగతం పలికారు.

కొడమంచిలిలో భూ రీసర్వే

ప్రజాశక్తి - ఆచంట

కొడమంచిలిలో జరుగుతున్న జగనన్న భూ రీసర్వే కార్యక్రమంలో రైతులు భాగస్వాములు కావాలని సర్పంచుల చాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే బృహత్తర కార్యక్రమమన్నారు. కొడమంచిలిలో రైతులకు సరిహద్దుల దగ్గర ఉన్న ఇబ్బందులు సరిచేయడానికి ప్రభుత్వం సర్వే చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో, బయట ప్రదేశాల్లో ఉన్న రైతులు జగనన్న భూ రీసర్వేకు సహకరించాలని కోరారు. ఈ భూ రీ సర్వే సుమారు 80 సంవత్సరాల తర్వాత జరుగుతుందన్నారు. ఏ రోజు ఎక్కడ సర్వే జరుగుతుందో రైతులకు ముందుగానే సమాచారం తెలియజేస్తామన్నారు. రైతు సంక్షేమం కోసం అహర్నిశలూ కృషి చేస్తున్న ఏకైక నాయకుడు సిఎం జగన్ అన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ ప్రవీణ్ రెడ్డి, విఆర్ఒ మిరియాల శేషాగిరి, సొసైటీ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, వార్డు మెంబర్ బొక్కా మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సమన్వయంతోనే గ్రామాలాభివృద్ధి

ప్రజాశక్తి - అత్తిలి

గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఆయా శాఖల సమన్వయం చాలా అవసరమని ఎంపిడిఒ వివివిఎస్ రామారావు అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో 2023-2024 సంవత్సరం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళ సంరక్షణ కార్యదర్శులు, డ్వాక్రా యనిమేటర్లు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్ర : అధికారులు, నాయకుల సమిష్టి కృషితోనే గ్రామాభివృద్ధి సాధ్యమని ఎంపిడిఒ బి.పూర్ణ బాబ్జి అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో జిపిడిపి, డిపిడిపిలపై పంచాయతీ కార్యదర్శులకు, ఫిషరీస్ అసిస్టెంట్, విఆర్ఒ, వెల్ఫేర్ అసిస్టెంట్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, అంగన్వాడీలకు శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి.

సమావేశంలో మాట్లాడుతున్న ఎఎంసి ఛైర్మన్ లావణ్య

పుంత రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తా

ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య

ప్రజాశక్తి - ఆచంట

పుంత రోడ్ల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య అన్నారు. బుధవారం ఆచంట మార్కెట్ యార్డు నూతన కార్యవర్గం మొట్టమొదటి సమావేశం ఎఎంసి ఛైర్మన్ లావణ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే పంట పొలాల నుంచి పండించిన పంటను గ్రామాల్లోకి, ప్రధాన రహదారుల వద్దకు చేర్చడానికి పుంత రోడ్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ రోడ్లు అభివృద్ధి చెందితే గ్రామాల మధ్య దూరం తగ్గి రైతులకు ఎంతో లాభం చేకూరుతుందన్నారు. ముఖ్యంగా వ్యవసాయ కమతాలకు, ఎరువులు, పురుగు మందులు వంటివి, తీసుకెళ్లేందుకు, పంటను గ్రామాల్లోకి తీసుకెళ్లేందుకు ఈ రోడ్లు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, కార్యదర్శి జై.కనకదుర్గారావు, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌ను అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పెనుగొండ

అధ్వానంగా పెనుగొండ మార్కెట్ శీర్షికన మంగళవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు కుమారుడు నరేష్ రాజు స్పందించారు. ఈ మేరకు బుధవారం ఆయన మార్కెట్‌ను పరిశీలించారు. అనంతరం వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

పాలపర్తివారిపేటలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - మొగల్తూరు

ఏసుప్రభు ప్రజలను రక్షించేందుకు భూమి పైకి వచ్చారని జిల్లా సినడు బిషప్ రైట్ రెవరెండ్ ఎంఎస్ మార్టిన్స్ అన్నారు. మొగల్తూరు పంచాయతీ పరిధి పాలపర్తివారి పేటలో దారం చర్చ్ ప్యారిస్ వన్ పరిధిలో సంఘాల పెద్దలు ముందస్తు క్రిస్మస్ వేడుకలను పాస్టర్ గోడి యేసోబురాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘానికి చెందిన ఉన్నమట్ల యోదిత్య హదాస్ పెద్దలకు టవల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పిట్టా థామస్, ఎం.శామ్యూల్ జాన్, తోట జాన్ మోజెష్ పాల్గొన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

చోరీ కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్లు రైల్వే ఎస్ఐ జి.హరిబాబు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం సాయంత్రం ఐదున్నర గంటలకు గూడెం పాత ఫ్లైఓవర్ కింద ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బలరాంపురం గ్రామానికి చెందిన ఆనిస్ అహ్మద్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి సుమారు 24 గ్రాములు బంగారు చైన్, ఒక వాచ్, ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.1,57,500 ఉంటుందని తెలిపారు. నిందితుడిని గురువారం రైల్వే కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మైన్స్ డెవలప్మెంట్ ఫండ్స్ (ఎండిఎఫ్) నిధులతో నియోజకవర్గంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు వెంటనే తయారు చేయాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఎండిఎఫ్ నిధులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముందుగా ఈ నిధులతో వీరవాసరం గ్రామంలోని పెదపేటకు సంబంధించి అక్కడి ప్రజల కోరిక మేరకు డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణానికి సంబంధించి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే కొత్త పూసలమర్రు గ్రామంలో పలు రోడ్ల నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలను తయారు చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో, భీమవరం పట్టణంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల కోరిక మేరకు అభివృద్ధి జరుగుతోందన్నారు. కరోనా సమయంలో మంజూరైన ఎన్ఆర్ఇజిఎస్ నిధులను పూర్తిగా వినియోగించుకోవడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. దాదాపుగా 2 సంవత్సరాలకు పైబడి కరోనా ప్రభావం పడిందన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ డిఇ స్వామినాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని టిడిపి భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి తెలిపారు. పట్టణంలో 9వ వార్డు ప్రకాష్ నగర్ క్లస్టర్ ఇన్‌ఛార్జి పామర్తి వెంకటరామయ్య, యూనిట్ ఇన్‌ఛార్జి కటికల పల్లారావు ఆధ్వర్యంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడారు. జగన్ పాలనలో రహదారులు మరమ్మతులకు నోచుకోవడం లేదన్నారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి మాట్లాడుతూ నిత్యావసర సరుకులను అదుపు చేయలేని వైసిపి సర్కార్ మరిన్ని పన్నుల భారాన్ని ప్రజలపై వేసి ఆర్థిక కష్టాల్లోకి నెట్టేశారని విమర్శించారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి పామర్తి వెంకటరామయ్య మాట్లాడుతూ తన క్లస్టర్ పరిధిలోని 25 వేల ఓటర్లను 5 యూనిట్లుగా విభజించి ఆయా బూత్ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ నమోదు చేస్తూ నియోజకవర్గ కార్యాలయానికి పంపుతున్నామని వివరించారు. యూనిట్ ఇన్‌ఛార్జి కటికల పల్లారావు మాట్లాడుతూ టిడిపి హయాంలో ప్రకాష్‌నగర్లో సిమెంట్ రోడ్లు నిర్మించి అభివృద్ధి చేశారని, ప్రస్తుత ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి చేయకుండా రోడ్లను నిర్లక్ష్యం చేసిందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదాసు కనకదుర్గ, సయ్యద్ నసీమా బేగం, పి.సూర్యకుమారి పద్మ పాల్గొన్నారు.

పాలకొల్లు :ఎన్నికల ముందు టిడ్కో గృహాలు ఉచితం అని చెప్పి అధికారంలోకి వచ్చాక జగన్ బ్యాంకు రుణం అని చెప్పి మహిళలను బ్యాంకులకు తిప్పడం దారుణమని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు విమర్శించారు. పాలకొల్లు నియోజవర్గంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా పాలకొల్లు 31వ వార్డులో బుధవారం ఇంటింటికీ తిరిగి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 4 సంవత్సరాలుగా మహిళలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పాదయాత్రలో హామీ ఇచ్చిన విధంగా టిడ్కో గృహాలు పేదలకు ఉచితంగా ఇవ్వాలని కోరారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం యనమదుర్రులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని క్షేత్రస్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యనమదుర్రు గ్రామానికి ఈ మూడేళ్లలో 1414 కుటుంబాలకు గాను 1297 కుటుంబాలకు 15 కోట్ల 50 లక్షల 56 వేల 381 రూపాయల లబ్ధి జరిగిందని అన్నారు. అంతేకాకుండా ఆక్వా సబ్సిడీ నిమిత్తం మొత్తం 37 సర్వీసులు ఉండగా కోటి 31 లక్షల 93 వేల 595 రూపాయల మేర లబ్ధి చేకూరిందన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో డ్రెయినేజీ, రోడ్లు, తాగునీటి సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామని వెల్లడించారు. గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో మొదటి విడతగా 58 లక్షల రూపాయలను, రెండో విడతగా కోటి 58 లక్షల నిధులను మొత్తంగా రెండు కోట్ల 16 లక్షల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహారావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, తహశీల్దార్ రవికుమార్ పాల్గొన్నారు.

దొడ్డనపూడిలో డిఎల్‌డిఒ విచారణ

విచారణ చేపడుతున్న డిఎల్‌డిఒ కిషోర్‌కుమార్

ప్రజాశక్తి - కాళ్ల

దొడ్డనపూడి గ్రామం జువ్వలపాలెం ఆర్అండ్‌బి రోడ్డులో నివాసాలకు ఆనుకొని మాంసం దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని దొడ్డనపూడి గ్రామానికి చెందిన జెవివి.నాగరాజు జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డిఎల్‌డిఒ కె.కిషోర్ కుమార్ బుధవారం విచారణ చేపట్టారు. అనంతరం దొడ్డనపూడిలోని కచ్చగరువు, అజ్జమూరు పంట కాలువకు ఆనుకుని ఉన్న గొర్రెల షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఫిర్యాదుదారుడు, వ్యాపారస్తులతో మాట్లాడారు. జనావాసాల మధ్య మాంసం దుకాణాలు కొనసాగించడం వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. దీనిపై నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు ఇస్తామని తెలిపారు. ఆయన వెంట భీమవరం పరిపాలన అధికారి పి.శామ్యూల్, ఎంపిడిఒ జి.స్వాతి, మండల పరిషత్ పరిపాలన అధికారి ఎంఎస్.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

పలుచోట్ల గ్రామ సభలు

ప్రజాశక్తి - ఉండి

జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షలో భాగంగా బుధవారం మండలంలోని చెరుకువాడ, అర్తమూరు, కోలమూరు, పాములపర్రు, ఉనుదుర్రు, యండగండి గ్రామాల్లో తహశీల్దార్ ఎం.రవీంద్ర కుమార్, డిప్యూటీ తహశీల్దార్ స్వామినాయుడు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వి.ఆంజనేయులు ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష వల్ల గ్రామాల్లో సరిహద్దు, భూ తగాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రైతులు రెవెన్యూ రికార్డులు స్వచ్ఛీకరణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చింతపర్రులో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

చింతపర్రు గ్రామంలో హెల్త్‌అండ్‌వెల్ నెస్ సెంటర్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని బుధవారం డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ నిర్వహించారు. సచివాలయం పరిధిలోని హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్లో పిహెచ్‌సి వైద్యాధికారి అడ్డాల ప్రతాప్ కుమార్, 104 వైద్యాధికారి పివి.నారాయణ ప్రజలకు వైద్య సేవలందించారు. గర్భిణులు, బాలింతలు, శిశువులు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కె.ప్రభాకర్, ఎంఎల్‌హెచ్‌పిలు కృష్ణవేణి, శ్రావణి, సూపర్‌వైజర్ అమలేశ్వరరావు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ప్రభుత్వం పెద్దపీట

ప్రజాశక్తి - ఆచంట

మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ అన్నారు. అయోధ్యలంక గ్రామ పరిసర ప్రాంతాల గోదావరి మధ్యలో ముఖ్యమంత్రి జగన్ స్వర్ణోత్సవ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా బుధవారం కేక్‌కట్ చేసి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ మాట్లాడుతూ మత్స్యకార జీవితాల్లో వెలుగు నింపిన ఏకైక నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకుంటూ ముందుకు సాగుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం మండల అధ్యక్షులు కొప్పాడి వీరవెంకట సత్యనారాయణ, నాయకులు కొప్పాడి సత్యనారాయణ, రమణ, గొల్లపల్లి బాలకృష్ణ, మానుకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

18న 2కె రన్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 18వ తేదీ ఉదయం 6 గంటలకు గాంధీబొమ్మల సెంటర్లో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే సేవ్ ది గర్ల్, చైల్డ్, 2కె రన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. బుధవారం బిఆర్ఎం హైస్కూల్, సెయింట్ మేరీస్, ఆదిత్య, చైతన్య స్కూల్స్, చైతన్య జూనియర్ కళాశాలలను సందర్శించి విద్యార్థులకు 2కె రన్ ప్రాముఖ్యతను ఎంఎల్ఎ వివరించారు. ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్స్ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు, సెక్రటరీ దేవరపు లక్ష్మీ నారాయణ, కోశాధికారి నెలకుర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో..

ఎస్‌సి వర్గీకరణ బిల్లు పెట్టాలి

ప్రజాశక్తి - ఆచంట

శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు మున్నంగి నాగరాజు డిమాండ్ చేశారు. ఆచంట పెద్దపేటలో ఎంఆర్‌పిఎస్ జిల్లా సమావేశం మండల ఇన్‌ఛార్జి దిగమర్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నాగరాజు పాల్గొని మాట్లాడారు. వచ్చే నెల ఆరో తేదీన బెంగుళూరులో జరగనున్న జాయతీ ఎంఆర్‌పిఎస్ మహాసభలో ఎంఎస్‌సి విద్యార్థులు పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ శీతకాల పార్లమెంటు సమావేశాల్లో బిజెపి ప్రభుత్వం ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ చేయకపోతే మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు తనకాల శేఖర్, ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ పసుపులేటి చిన్నబాబు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై కళాజాతా

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లి గ్రామంలో కళాజాతా బృందం సభ్యులు బుధవారం ఎయిడ్స్ నివారణపై ప్రదర్శన చేశారు. ఎపి ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జాతీయ ఎయిడ్స్ నియంత్రణా సంస్థ, కలెక్టర్ ఆదేశాల మేరకు మిరియాల సత్యనారాయణ కళాజాత బృంద సభ్యులు ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కోపనాతి పల్లయ్య, చైల్డ్ ఫండ్ ఇండియా విజయలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సేవా దృక్పథం లయన్స్ సొంతం : డగ్లస్ అలెగ్జాండర్

ఘనంగా లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు

ఆకివీడు: మాట్లాడుతున్న ఎల్‌సిఐఎఫ్ ఛైర్‌పర్సన్ డగ్లస్ అలెగ్జాండర్

ప్రజాశక్తి - ఆకివీడు

సేవా దృక్పథం లయన్స్ క్లబ్ సొంతమని లయన్స్ ఇంటర్నేషనల్ ఇమ్మీడియట్ పాస్ట్ ప్రెసిడెంట్, ఎల్‌సిఐఎఫ్ ఛైర్ పర్సన్ డగ్లస్ అలెగ్జాండర్ అన్నారు. బుధవారం ఆకివీడు లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ముందుగా ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రి దగ్గరలో ఏర్పాటు చేసిన లయన్స్ పైలాన్‌ను ఆవిష్కరించారు. అలాగే ఆ ప్రాంగణంలో లయన్స్ గోల్డెన్ జూబ్లీ భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం శాంతి ఫంక్షన్ హాల్లో జరిగిన లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్‌ను డగ్లస్ ప్రారంభించి మాట్లాడారు. లయన్ క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో చేపట్టిన సేవలు, ఎల్‌సిఐఎఫ్ అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఈ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం లయన్స్ 316జి జిల్లా వ్యాప్తంగా కొత్తగా ఎంజెఎఫ్ (అంతర్జాతీయ లయన్స్ సంస్థకు వెయ్యి డాలర్లు డొనేట్ చేసిన) సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవిఎస్.రాజు, సిహెచ్ కృష్ణంరాజు, లయన్స్ గవర్నర్ వికె.పంకజాక్షన్, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జి.మాణిక్యాలరావు, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాకరాల వేణు బాబు, సభ్యులు పాల్గొన్నారు.

ఉండి:సేవ చేయడంలో ఉన్న సంతృప్తి దేనిలోను లభించదని లయన్స్ క్లబ్ అంతర్జాతీయ మాజీ ప్రెసిడెంట్ డగ్లస్ అలగ్జాండర్ అన్నారు. అలెగ్జాండర్ బుధవారం ఆకివీడు పర్యటనకు వచ్చిన నేపథ్యంలో ఉండి లయన్స్ క్లబ్ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. దేశంలో పలు ప్రాంతాలను సందర్శించినట్టు తెలిపారు. అన్ని చోట్లా లయన్స్ క్లబ్ సేవలు బాగున్నాయన్నారు. ఆయనను కలిసిన వారిలో ఉండి లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుద్రరాజు నరసరాజు, అధ్యక్షులు గొట్టుముక్కల రాము, వైస్ ప్రెసిడెంట్ గాదిరాజు రంగరాజు ఉన్నారు.

లయన్ మురళీ కృష్ణంరాజుకు అరుదైన గౌరవం

తాడేపల్లిగూడెం:2022లో లయన్స్ క్లబ్‌లో 25 మంది నూతన సభ్యులను చేర్చిన తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజుకు అంతర్జాతీయ లయన్స్ క్లబ్స్ తరుపున మాస్టర్ కీ పిన్‌ను ప్రదానం చేశారు. భారత్ పర్యటనలో భాగంగా బుధవారం ఆకివీడు విచ్చేసిన ఎల్‌సిఐఎఫ్ ఛైర్మన్ డగ్లస్ అలెగ్జాండర్ చేతుల మీదుగా పిన్ ప్రశంసా పత్రాన్ని మురళీ కృష్ణంరాజు అందుకున్నారు. ఈ సందర్భంగా మల్టీ క్లబ్స్ నాయకులు సిహెచ్.కృష్ణంరాజు, క్లబ్ జిల్లా గవర్నర్ పంకజాక్షన్, డిప్యూటీ గవర్నర్ లయన్, గట్టిం మాణిక్యాలరావు ఫస్ట్ గవర్నర్స్ తదితరులు ఆయనను అభినందించారు.

పాలకొల్లు : సన్ షైన్ జిజె లియో క్లబ్ విద్యార్థులు లయన్స్ కంటి ఆసుపత్రికి లక్ష రూపాయల విరాళం అందజేవారు. బుధవారం లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు, ఛైర్మన్ డగ్లస్ అలెగ్జాండర్ పాలకొల్లు లయన్స్ కంటి ఆసుపత్రిని సందర్శించారు. ఆయన చేతుల మీదుగా ఆసుపత్రికి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా అలెగ్జాండర్ మాట్లాడుతూ తాను ఎన్నో దేశాలు తిరిగానని లియో క్లబ్ సభ్యులు ఎక్కడా ఇంత చిన్న వయస్కులు ఉండడం చూడలేదని తెలిపారు. చిన్న వయసులోనే సేవాతత్పరత అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వికె.పంకజాక్షన్, లయన్స్ ప్రెసిడెంట్ ఎంవి సత్యనారాయణ, సెక్రటరీ చల్లా ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆసుపత్రి సిబ్బందికి నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకు ప్రభుత్వాసుపత్రిలో పనిచేసే శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ సిబ్బందికి నిత్యావసర వస్తువులు అందించడం గొప్ప ఆలోచన అని జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ కె.శివప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఉందుర్తి పాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిట్టూరి సుజాత వారికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. రోగుల సౌకర్యార్థం వీల్‌ఛైర్ బహూకరించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రికి ఎక్కువ శాతం మంది పేదలే వస్తుంటారని తెలిపారు. వారిలో కొంత మందికి బ బంధువులు ఉండరని అటువంటి సందర్భాల్లో రోగులకు శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది అండగా ఉంటారని తెలిపారు. సిబ్బందికి నిత్యావసర వస్తువులు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా చిట్టూరి సుజాతను అభినందించారు. ఉందుర్తి పాల్ ఫౌండేషన్ ఆర్గనైజర్ ఉందుర్తి ప్రసన్న మాట్లాడుతూ సుజాత కరోనా సమయంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉండ్రాజవరపు వంశీ, ఉండ్రాజవరపు చరణ్, చింటు, అమర్, మంజు, ఏలీషా, ధర్మాన పుష్పలత, ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - మొగల్తూరు

శేరేపాలెంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మైక్రో ఫైలేరియా పరీక్షలు పిహెచ్‌సి వైద్యులు దినేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ల్యాబ్ టెక్నీషియన్ కిషోర్, హెల్త్ సూపర్‌వైజర్ బి.శ్రీనివాసు, కె.సాంబశివరావు, రామకృష్ణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వినికిడి లోపం విద్యార్థులకు మిషన్ల పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

కొడమంచిలి జిల్లా పరిషత్ హైస్కూల్లో 9, 10వ తరగతి విద్యార్థులు చదలవాడ యానిమ, చిట్టూరి లక్ష్మీనరసింహ వినికిడి లోపంతో బాధపడుతున్నారు. వారికి ప్రభుత్వం ద్వారా రూ.17 వేలు విలువ చేసే వినికిడి యంత్రాలను సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగ విద్యార్థులకు ప్రత్యేకంగా స్కూల్లో తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొమ్మేటి రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినవి

ఏలూరు జిల్లా, గణపవరం మండలం, గణపవరం గ్రామ కాపురస్తులయిన కొప్పెల్లా సత్యనారాయణ రాజు, తండ్రి: కృష్ణంరాజు అను నాకు డాక్యుమెంట్ నెం. 502/1992, అను దస్తావేజు గణపవరంలో జిరాక్సు తీసుకొనుట కొరకు సెంటర్‌కు వెళ్ళి జిరాక్సు తీయించుకొని కవరులో పెట్టుకొని కవరును మోటారు సైకిల్‌కి తగిలించుకొని ఇంటికి వస్తుండగా కవరు దారిలో ఎక్కడో పడిపోయినది. మళ్ళీ ఎంత వెతికినా దొరికలేదు. కావున ఈ దస్తావేజు దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయవలసిందిగా కోరుచున్నాను.

కొప్పెల్లా సత్యనారాయణ రాజు
తండ్రి: కృష్ణంరాజు, గణపవరం (గొల్లలదిబ్బ)
ఫోన్: 90804 27363

IN THE COURT OF THE HON'BLE V TH JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD

O.S.No.1690 of 2016

Between:
Union Bank of India, [Erstwhile Andra Bank] Credit Card Division, Koti, Sultan Bazar, Hyderabad
Rep. by its Chief Manager
...Plaintiff.

AND

R-1. Sri Goshtu Venkateswarlu (Died)
R-2. Smt. Goshtu Pushpavathi W/o. Late Sri. Goshtu Venkateswarlu, Occ: House Wife, H.No. 6-2/57/3, Venkata padmavathi Nilayam, Sugar Colony, Palakol, 534 260. West Godavari
...Defendant

The Plaintiff has filed the above Numbered suit against you for recovery of Rs. 1,66,625.00 ps. (Rupees One Lakh Sixty Six Thousand Six Hundred And Twenty Five Only) due under Bank credit card together with service charges and costs, the same stands posted to 26-12-2022 for your appearance in person or through duly appointed advocate at 10.30 am and if you fail to so appear, the matter will be decided on merits, in your absence.

(BY ORDER OF THE COURT)

SMT. TVV SAI NAGA LAKSHMI
Advocate
TVV Law House
Flat No. 610 B, Amrutha Estates,
Himayatnagar, Hyderabad - 029.
e-mail : tvvlawhouse@gmail.com
Phone : 9391319514.

నోటీసు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, ఏలూరు, ఏలూరు జిల్లా

O.S.No. 522/2011

Between:
1) Sri. Kotti Veera Ramamohana Rao
2) Sri. Kotti Muralidhara Rao
...Plaintiff

AND

1) Sri. Singara Namassivaya Rama Kriahna Brahmananda Rao (Died) & 11 Others
...Defendants

TO:
D-8: Sri. Singara Yesu Prabhudasu, S/o. Late Singara Namassivaya Rama Krishna Brahmanandarao, Employee, Resident of D.No. 20B-2-1/3, C/o. Muthayalarao, Sekhar Street, Gandhinagar, Eluru, Eluru Dt., Eluru JCJC.
D-9: Smt. Mekala Vijaya Lakshmi, W/o. Mekala Gopi, House Wife, Resident of D.No. 20B-2-1/3, C/o. Muthayalarao, Sekhar Street, Gandhinagar, Eluru, Eluru Dt., Eluru JCJC.
D-10: Sri. Singara Sureshkumar, S/o. Late Singara Namassivaya Rama Krishna Brahmanandarao, Private Employee, Resident of D.No. 20B-10-16, Sekhar Street, Gandhinagar, Eluru, Eluru Dt., Eluru JCJC.
D-11: Smt. Kilarapu Geetha, D/o. Late Singara Namassivaya Rama Krishna Brahmanandarao, Resident of D.No. 20A-16-35, Narni Veeresalingam Veedhi, Gandhinagar, Eluru, Eluru Dt., Eluru JCC.
D-12: Sri. Singara Rajkumar, S/o. Late Singara Namassivaya Rama Krishna Brahmanandarao, Private Employee, Resident of D.No. 20B-10-16, Sekhar Street, Gandhi nagar, Eluru, Eluru Dt., Eluru JCJC.

పై ఒ.యస్.నెం. 522/2011రు గల దావా గ్రంధములో 1వ ప్రతివాది అయిన సింగర నమశ్శివాయ రామకృష్ణ బ్రహ్మానందరావు గారు కాలము చేసినందున చట్టప్రకారం వారి వారసులు అయిన మిమ్ములను సదరు పై దావాలో 8 టు 12 ప్రతివాదులుగా చేర్చి శ్రీకోర్టు వారు జారీచేసిన ఉత్తర్వులు ప్రకారం నోటీసులు మరియు సమన్లు కోర్టు నుండి మరియు రిజిస్టర్డు పోస్టు ద్వారా పలుమార్లు మీకు పంపిననూ మీరు సదరు నోటీసులు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయమని **ది.03-01-2023వ తేదీ వాయిదా రోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, మీ తరుపు న్యాయవాది గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావలయునని శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు.** లేని ఎడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు పై దావా వాయిదా తేదీ : 03-01-2023

T.JAGAN MOHAN
Advocate, Eluru.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ అనగా పశ్చిమ గోదావరి జిల్లా, పెనుగొండ మండలం, నడిపూడి గ్రామ కాపురస్తులు, కడలి చిన వెంకన్న గారి కుమారుడు వీర వెంకట సత్యనారాయణ గారు నాకు ఇచ్చిన నంజాయిషీపై తెలియజేయునది ఏమనగా ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు ఆస్తిని నా క్లయింట్‌కు తన అన్నగారైన అయిన కడలి వెంకట నారాయణ గారు ది.23.04.2015వ తేదీన వ్రాసి యిచ్చిన వీలునామా ద్వారా సంక్రమించిన ఆస్తి అయివుండి తన అన్నగారి మరణానంతరము నుండి నా క్లయింటు సమస్త స్వాధీన హక్కు భుక్తములతో అనుభవించుచున్నారు. సదరు షెడ్యూలు ఆస్తిపై నా క్లయింటుకు తప్ప వేరేవారెవ్వరికినీ ఎటువంటి హక్కుగాని ఏ విధమైన సంబంధములు గాని లేవని ఇందుమూలముగా తెలియపచడమైనది.

షెడ్యూలు ఆస్తి వివరము : పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం జిల్లా రిజిస్ట్రారు వారి పరిధిలోని తణుకు సబ్‌డి లోని తణుకు మండలం తేతలి గ్రామ పంచాయితీ ఏరియా లోని తేతలి గ్రామం తాలూకు ఆర్.ఎస్.నెం.48/1బి మరియు ఆర్.ఎస్.నెం.49/4బి దాఖలా రెండు ప్రతులుగా గల భూమి మొత్తం చ॥గ॥2307.20లు. అందులోని నానావిధ ఫలవృక్షములు మరియు సమస్త ఈజుమెంటు హక్కులతో సహా.

వి.వి. సత్య సాయి, అడ్వకేట్,
టీచర్స్ కాలనీ, కె.సావరం పంచాయితీ
తణుకు, సెల్ : 94403 72736